# గ్రామ సింహాలతో జర భద్రం

## నేడు వరల్డ్ రేబిస్ డే

- కాటుతో ప్రాణాలకు ముప్పు
- జాగ్రత్తలు తీసుకోవాల్సిందే

కుక్కలు మన స్నేహితులు. పెంపుడు జంతువులలో అగ్రభాగం వీటిదే. అనేక రకాలు ఉన్నాయి. ఇంటి రక్షణగా కూడా భావిస్తుంటాం. ఇంట్లో పెంపకానికి తగిన ప్రాధాన్యం ఇస్తాం. అయితే వాటిని తగిన వ్యాక్సిన్ చేయిస్తే పర్వాలేదు. కానీ కొన్ని సందర్భాలలో కాటుకు గురయితే మాత్రం రేబిస్ బారిన పడతాం. కుక్క కాటును నిర్లక్ష్యంగా చేయవద్దు. ప్రతి ఏడాది సెప్టెంబర్ 28న 'వరల్డ్ రేబిస్ డే' నిర్వహిస్తున్నారు.



గుంటూరు మెడికల్: ప్రతి కుక్కలోనూ రేబిస్ వైరస్ ఉండదు. కాని వైరస్ ఉన్న కుక్క ఏదో తెలియదు. కాబట్టి ప్రతి కుక్కకాటును సీరియస్‌గానే పరిగణించాలి. పిచ్చికుక్క కరిచిన వెంటనే జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ప్రతి ఏడాది జిల్లాల్లో కుక్కకాటు ద్వారా పది మందికి పైగా మరణిస్తున్నారు. కుక్కకాటు ద్వారా సంభవించే రేబిస్ వ్యాధి 2011లో ఉభయ తెలుగు రాష్ట్రాలను వణికించివేసింది.

### వ్యాధి లక్షణాలు...


రేబిస్ సోకిన కుక్క నాలుక బయటకు చాపి, సొంగ కారుస్తూ మతి స్థిమితం లేకుండా తిరుగుతూ, తన యజమానిని కూడా గుర్తించలేదు. కన్పించిన ప్రతి వస్తువును కరిచేందుకు ప్రయత్నిస్తుంది. నడిచేటప్పుడు తడబడుతూ, తూలుతూ తోకను ఆడించలేని స్థితిలో ఉంటుంది. కుక్క అరుపులో మార్పు వస్తుంది. నీటిని కూడా తాగలేని స్థితిలో అంటుడొక్కలు పడి ఊపిరి పీల్చుకోలేక ఐదు నుంచి ఏడు రోజుల్లో మరణిస్తుంది.

### మనుషుల్లో లక్షణాలు...

మనుషులు రేబిస్ వ్యాధికి గురైనప్పుడు దవడ, గొంతు కండరాలకు పక్షవాతం వచ్చి ఎంత దాహం వేసినా నీటిని తాగలేరు. రోగి నీటిని చూసినా, నీటి శబ్దం విన్నా భయకంపితులవుతారు. ఈ లక్షణాన్ని హైడ్రోఫోబియా అని పిలుస్తారు. ఇలాంటి స్థితిలో మతిస్థిమితం కోల్పోయి ఊపిరి పీల్చుకోలేక మనుషులు కూడా మరణిస్తారు.

### బాధితులు ఇలా....

గుంటూరు జీజీహెచ్‌లో 2023లో 34,931 మంది కుక్కకాటు బాధితులు ఇంజక్షన్లు చేయించుకున్నారు. 2024 జనవరి నుంచి ఆగస్టు వరకు 29,202 మంది కుక్కకాటు బాధితులు ఇంజెక్షన్లు చేయించుకోగా సెప్టెంబర్‌లో 1369 మంది ఇంజెక్షన్లు చేయించుకున్నారు. సకాలంలో ఇంజెక్షన్లు చేయించకపోవటంతో ప్రభుత్వ ఛాతి, సాంక్రమిత వ్యాధుల ఆస్పత్రి(జ్వరాల ఆస్పత్రి)లో చికిత్స పొందుతూ 2021లో 13 మంది మరణించారు. 2022లో తొమ్మిది మంది, 2023లో 18 మంది, 2024 జనవరి నుండి ఆగస్టులో తొమ్మిది మంది బాధితులు చనిపోయారు.




రేబిస్ డే పోస్టర్

### ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా వ్యాక్సిన్లు



జీజీహెచ్‌తో పాటు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా ర్యాబీపూర్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. జీజీహెచ్‌లో ప్రతి రోజూ సుమారు 60 నుంచి 70 మంది వ్యాక్సిన్ చేయించుకుంటున్నారు. అత్యవసర విభాగంలో అన్ని వేళలా ఈ వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుంది. కుక్కకరిచిన రోజు మూడో రోజు, ఏడో రోజు, 28వ రోజు మొత్తం నాలుగు సార్లు ఇంజెక్షన్లు చేయించాలి.

–డాక్టర్ బత్తుల వెంకటసతీష్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ, గుంటూరు జీజీహెచ్

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు...



పిచ్చికుక్క కరిచిన వెంటనే గాయాన్ని చల్లటి నీటితో, సబ్బుతో కడగాలి. గాయంపై నీరు ధారగా పడే విధంగా చేయాలి. గాయంపై టింక్చర్ అయోడిన్ వేయాలి. గాయానికి కుట్లు వేయటం, ఆయింట్‌మెంట్ పూయటం, గాయాన్ని నిప్పుపెట్టి కాల్చటం, కోయటం వంటివి చేయకూడదు. కుక్క కరిచిన వెంటనే వైద్యులను సంప్రదించి టీకాలు వేయించకోవటం ద్వారా వ్యాధి నుండి రక్షణ పొందవచ్చు. పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలి.

–డాక్టర్ నరేంద్ర వెంకటరమణ, ఫిజీషియన్, గుంటూరు

## క్లుప్తంగా

### నేడు తెలుగు సినీ సంగీత విభావరి

నగరంపాలెం: గుంటూరు జిల్లా సంగీత కళాకారుల సంఘం 13వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు సినీ సంగీత విభావరి శనివారం నిర్వహించనున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దు వెంకటస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రమణ్యం, పి.సుశీల ఆలపించిన మధురమైన సినీ గీతాలు ఆలపిస్తారని, కళాభిమానులు హాజరుకావాలని ఆయన తెలిపారు.

### సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి బర్ధన్‌కు నివాళి

లక్ష్మీపురం: సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్ధన్ శత జయంతి సభ స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో నిర్వహించారు. తొలుత బర్ధన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి పార్టీ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి.రాధాకృష్ణ మూర్తి పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంత రావు, నగర గౌరవ అధ్యక్షులు జి.సురేష్ బాబు, నగర కార్యదర్శి రావుల అంజిబాబు, సీపీఐ నాయకులు ఎం.శ్రీనివాస్ రావు, బి.యస్వంత్, ఎస్. చిన్న పాల్గొన్నారు.

### యలమంచిలి శివాజీకి విశ్రాంత డీజీపీ పరామర్శ



గుంటూరు ఎడ్యుకేషన్: హైదరాబాద్‌లో గొంతు శస్త్ర చికిత్స చేయించుకుని గుంటూరు వచ్చిన రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీని రిటైర్డు డీజీపీ ఎం.మాలకొండయ్య పరామర్శించారు. శుక్రవారం బృందావన్‌గార్డెన్స్‌లోని శివాజీ స్వగృహానికి వెళ్లిన మాలకొండయ్య, తానా మాజీ అధ్యక్షుడు మంతెన నర్సరాజు ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

### జాషువా కవితా పురస్కారం ప్రదానం



లక్ష్మీపురం: పద్యాన్ని సరళమైన తెలుగులో, ప్రజలకు అర్థమయ్యే విధంగా చెప్పిన కవి గుర్రం జాషువా అని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జాషువా జయంతి సందర్భంగా శుక్రవారం జాషువి కవితా పురస్కార ప్రదాన సభ నిర్వహించారు. ఈ సభకు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. జాషువా పురస్కారాలను ప్రముఖ సాహితీవేత్త గుమ్మా సాంబశివరావు, అభ్యుదయ కవి గంటేడ గౌరునాయుడుకి ప్రదానం చేశారు. బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 1917– 1966 మధ్య జాషువా రచనా కాలంలో అంతర్జాతీయంగా, జాతీయంగా చోటుచేసుకున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలతో ఆయన కవిత్వాన్ని విడదీసి చూడలేమని చెప్పారు. జాతీయోద్యమం, పునరుజ్జీవ ఉద్యమం, వర్గపోరాటాలు, ప్రపంచ యుద్ధాలు, సామాజిక అంశాలు ఇలా అన్ని అంశాలల్లో తన భావాలను వెల్లడించాడన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ జాషువా సాహిత్య కాలం నాటి సామాజిక అంతరాలు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో జాషువా సాహిత్యాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు, కార్యదర్శి ఎస్.కాళిదాసు పాల్గొన్నారు. సభలో తొలుత జాషువా విగ్రహానికి వక్తలు, సాహితీవేత్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### పర్యాటక రంగం ఎంతో కీలకం



గుంటూరు ఎడ్యుకేషన్: దేశ ఆర్థికాభివృద్ధిలో పర్యాటక రంగం ఎంతో కీలకమని టీజేపీఎస్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతులను తెలియజేసే చిత్రకళలు, దేవాలయాలు, అద్భుతమైన శిల్ప సంపద పర్యాటక రంగంలో అంతర్భాగమని అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె.కామేశ్వరశాస్త్రి, డాక్టర్ నాల నిర్మల, విజయలక్ష్మి పాల్గొన్నారు.

- టీజేపీఎస్ పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవలో భాగంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

### నేడు ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల వార్షికోత్సవం

నగరంపాలెం: డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల 52వ వార్షికోత్సవ వేడుకలు శనివారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కేఎస్ గోవిందరాజన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై వేడుకలు జరుగుతాయని చెప్పారు. ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి హాజరవుతారని పేర్కొన్నారు.

### ఎక్సైజ్ గుంటూరు డిపో మేనేజర్ శ్రీలత బాధ్యతలు స్వీకారం



నెహ్రూ నగర్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గుంటూరు డిపో మేనేజర్‌గా శ్రీలత నల్లపాడు లోని డిపోలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల నిర్వహించిన ఎక్సైజ్ శాఖ అధికారుల బదిలీల్లో రాజమహేంద్రవరంలో విధులు నిర్వహిస్తున్న శ్రీలతను గుంటూరు డిపోకు బదిలీ చేశారు. ఇక్కడ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న వెంకటరామిరెడ్డిని ఏలూరు డిపోకు బదిలీ చేశారు. అదేవిధంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్(అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్)గా సూర్యనారాయణ, గుంటూరు ఈఎస్ టాస్క్ ఫోర్స్ ఏఈఎస్‌గా మారయ్య బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

### అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

నెహ్రూ నగర్: గోరంట్ల అంబేడ్కర్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ పీడీ(ప్రాజెక్ట్ డైరెక్టర్) ఉమాదేవి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. లబ్ధిదారులకు కందిపప్పు ఇంకా పంపిణీ చేయకపోవడంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో లబ్ధిదారులకు పౌష్టికాహారం అందజేయాలని లేకుంటే సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నేడు పూజా కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

తూర్పు సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా



నూరిఫాతిమాను సత్కరిస్తున్న ఆలయాల చైర్మన్‌లు

పట్నంబజారు: రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ శనివారం చేపట్టనున్న పూజా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పిలుపునిచ్చారు. మంగళదాస్‌నగర్‌లోని ఆమె కార్యాలయంలో శుక్రవారం ఆయా ఆలయాల చైర్మన్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టీడీపీ నేతల పాపాన్ని ప్రక్షాళన చేసే దిశగా చేపట్టనున్న పవిత్ర పూజా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం ప్రసాదంపై తప్పుడు ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలను ఆ దేవుడు క్షమించరని పేర్కొన్నారు. టీడీపీ నేతలు కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలా హుందా రాజకీయాలు చేయాలని సూచించారు. అనంతరం నూరిఫాతిమాను ఆలయా చైర్మన్లు సత్కరించారు. కార్యక్రమంలో ఆయా ఆలయాల చైర్మన్‌లు దుర్గాప్రసాద్, మాదాసు మాధవ, మొగిలి సతీష్, రాంబాబు, గాంధీనాయక్, వీరాఎరడ్డి, వెంకట్రావు, నాగరాజు పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

- విరుత్స సాఫ్ట్‌వేర్ సంస్థ నేషనల్ హెడ్ అభిషేక్
- కళ్లం కళాశాలలో సంకల్ప్ వేడుకలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు లక్ష్య సాధన దిశగా క్రమశిక్షణతో సాంకేతిక నైపుణ్యాలను మెరుగులు దిద్దుకుంటూ ముందుకు సాగాలని, కష్టపడితే లక్ష్య సాధన సులభమని విరుత్స సాఫ్ట్‌వేర్ సంస్థ నేషనల్ హెడ్ జి.అభిషేక్ తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని కళ్లం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన సంకల్ప్– 2024 వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్యపై అన్నివిధాలుగా పట్టు సాధించనపుడే అవకాశాలు లభిస్తాయన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ విభాగాల్లో పేపర్ ప్రజంటేషన్, టెక్నికల్ క్విజ్, హ్యాకథాన్, కోడింగ్ టెస్ట్, ట్రజరర్‌హంట్, మార్కెట్ మేకర్స్, బిజినెస్ క్విజ్ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. టెక్నికల్ క్విజ్‌లతోపాటు క్రీడా విభాగాలలో చెస్, క్రికెట్, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, త్రోబాల్ తదితర పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వివిధ క్రీడలు, వివిధ విభాగాల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కళ్లం మోహనరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పి.వెంకటేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, డాక్టర్ జి.కిషోర్‌బాబు, హనుమంత ప్రసాద్, డాక్టర్ పీఎల్ మాధవరావు పాల్గొన్నారు.

## వీవీఐటీలో ఐక్యా 2కే24



ఐక్యా 2కే24 కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోని ఐఈటీఈ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఐక్యా 2కే24 సాంకేతిక సదస్సును విద్యార్థి విభాగం చైర్మన్ డాక్టర్ బి.సూర్యప్రసాద్ ప్రారంభించారు. మండల పరిధిలోని నంబూరు వీవీఐటీలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ వేడుకల్లో 30 కళాశాలలకు చెందిన 1400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ వేడుకలలో డైవ్ ఇన్ థాట్స్, బ్రేకింగ్ కోడ్స్, మిస్టరీ లూట్, క్రియేటివ్ క్లాష్ వంటి 15 సాంకేతిక అంశాలలో పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఐఈటీఈ చైర్మన్ సూర్యప్రసాద్ మాట్లాడుతూ రోజురోజుకీ పెరుగుతున్న ఆధునిక సాంకేతికతను 6జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతికత సరైన మార్గంలో మానవాళి అవసరాలకు అనుగుణంగా వినియోగించాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి విద్యార్థులు అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, ఇటువంటి సాంకేతిక సదస్సుల వలన విద్యార్థులు సాంకేతిక మార్పులను సులభంగా తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.భానుమూర్తి, ఐఈటీఈ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### ప్రజాకవి జాషువా

లక్ష్మీపురం: విశ్వమానవుడు గుర్రం జాషువా అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సాహితీ వేత్త ముప్పాళ్ల ప్రసాదరావు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం గుర్రం జాషువా జయంతి నిర్వహించారు. తొలుత చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు పండితులు రాజన్న మాస్టర్, సంస్థ సభ్యులు తదితరులు ప్రసంగించారు.

### జాషువా పురస్కారానికి పీవీ రమణ ఎంపిక



పీవీరమణ

నగరంపాలెం: ఏపీ రాష్ట్ర ప్రభుత్వ కవి కోకిల జాషువా పురస్కారం– 2024కు జాషువా కల్చరల్ సెంటర్ కన్వీనర్, ప్రజా గాయకుడు పీవీ రమణ ఎంపికయ్యారు. విజయవాడ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో శనివారం నిర్వహించనున్న కార్యక్రమంలో ఈ పురస్కారం అందుకోనున్నట్లు శుక్రవారం రమణ తెలిపారు. పదేళ్లుగా తాను నిర్వర్తించే జాషువా సాహిత్య కార్యక్రమాలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేయడం గర్వంగా ఉందన్నారు.

### అలరించిన విశ్వనరుడు పద్యనాటకం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అన్నమయ్య కళావేదికపై శుక్రవారం విశ్వనరుడు– జాషువా పద్య నాటకం ప్రదర్శించారు. ఆలయ అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. నంది పురస్కార గ్రహీత డాక్టర్ నరాలశెట్టి రవికుమార్ రచించిన ఈ పద్య నాటకంలోని పలు అంశాలపై కొనసాగింది. కళా రంగాలకు చెందిన కళాకారులు ఉప్పాల వెంకట రత్తయ్య, గుంటుపల్లి ఆంజనేయులుచౌదరి, తుర్లపాటి రాధాకృష్ణమూర్తి, నాయుడుగోపి, సాంబిరెడ్డి, రమాదేవిలను సత్కరించి, నగదు పురస్కారం అందించారు. కార్యక్రమంలో మాజీమంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, అప్పాజోష్యుల సత్యనారాయణ మహో ఉపన్యాసం చేశారు.

## కామెర్ల వ్యాధికి ఆపరేషన్‌తో చెక్

జీజీహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్



రోగి లెనిన్‌బాబుతో డాక్టర్ అందె కోటి వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: ఏడాదిగా కామెర్ల వ్యాధితోతో బాధపడుతూ పలు ఆస్పత్రులు తిరిగినా వ్యాధి నయం కాని రోగికి గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ సర్జికల్ విభాగం వైద్యులు అరుదైన ఆపరేషన్ చేసి వ్యాధి నుంచి విముక్తి కల్పించారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం పెదకొత్తపల్లికి చెందిన లెనిన్‌బాబు ఏడాదిగా జాండీస్‌తో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నాడు. అయినా ఫలితం లేకపోవడంతో గత ఏడాది సెప్టెంబరులో గుంటూరు జీజీహెచ్‌కు వచ్చాడు. గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగాధిపతి డాక్టర్ కవిత, పలు రకాల పరీక్షలు చేసి అక్టోబరులో స్టంట్ వేశారు. కొంత మేర ఉపశమనం లభించి కామెర్లు తగ్గుముఖం పట్టాయి. 2024 మార్చిలో తీవ్ర జ్వరం రావడంతో జీజీహెచ్‌కు వచ్చారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు ఏప్రిల్ 10న రెండోసారి స్టంట్ వేశారు. మూడు నెలలపాటు ఆరోగ్యంగా ఉన్న లెనిన్‌బాబు మరలా తీవ్ర జ్వరం రావడంతో గతనెల జీజీహెచ్‌కు వచ్చారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అందె కోటివెంకటేశ్వర్లు పరీక్షలు చేసి కడుపులో గడ్డలు ఉన్నట్లు గుర్తించారు. పేగులు దెబ్బతిని ఉండటం గమనించారు. ఆపరేషన్ చేయాలని, రిస్క్‌తో కూడుకుందని కుటుంబ సభ్యులకు వివరించారు. 20 రోజుల క్రితం ఆపరేషన్ చేసి దెబ్బతిన్న పేగు తీసివేసి, దాని స్థానంలో కొత్తపేగును అమర్చారు. కణితులను దయాలసిస్ ల్యాబ్‌కు పంపగా, క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ కావడంతో, క్యాన్సర్ చికిత్సకు రిఫర్ చేశారు. సుమారు ఆరు గంటలసేపు చేసిన ఆపరేషన్ ప్రక్రియలో డాక్టర్ కోటి వెంకటేశ్వర్లుతోపాటు, డాక్టర్ సత్యదేవ్, డాక్టర్ వంశీ, ఎనస్థీషియా వైద్యులు డాక్టర్ పోలయ్య, డాక్టర్ శాంసన్, డాక్టర్ శ్వేత, డాక్టర్ దీప్తి పాల్గొన్నట్లు డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ శుక్రవారం మీడియాకు వెల్లడించారు. సుమారు రూ.10 లక్షల ఖరీదు చేసే ఆపరేషన్‌ను ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా పూర్తి ఉచితంగా చేశామన్నారు. ఎంతో కష్టమైన ఆపరేషన్‌ను విజయవంతం చేసి లెనిన్‌బాబు ప్రాణాలు కాపాడిన సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య బృందాన్ని డాక్టర్ కిరణ్‌కుమార్ అభినందించారు.

## మైనర్లు వాహనాలు నడపొద్దు..

ట్రాఫిక్ డీఎస్పీ రమేష్



మాట్లాడుతున్న ట్రాఫిక్ డీఎస్పీ రమేష్

నగరంపాలెం: మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపొద్దని ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ అన్నారు. శ్రీవెంకటేశ్వర బాలకుటీర్ పాఠశాల, హిందూ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. ఇళ్లు, కార్యాలయాల నుంచి బయలుదేరే ప్రతి ఒక్కరూ నెమ్మదిగా వాహనాలు నడపాలని అన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా వెళ్లిన ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు హెల్మెట్, కార్లు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు అవగాహన పెంచుకుని, కుటుంబ సభ్యులకు, స్థానికులకు తెలియజేయాలని తెలిపారు. అతి వేగంతో వాహనాలు నడిపితే దుష్పరిణామాలను వారికి వివరించాలని అన్నారు. కార్యక్రమం లో సీఐలు సింగయ్య(పశ్చిమ ట్రాఫిక్), అశోక్(తూర్పు ట్రాఫిక్) పాల్గొన్నారు.

### రోడ్డుపై పడి వృద్ధురాలి మృతి



పట్నంబజారు: అనారోగ్యంతో రోడ్డుపై వృద్ధురాలు పడి మృతిచెందిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. రైలుపేటలోని గొలుసు నాంచారమ్మ హైస్కూల్ సమీపంలో నివాసం ఉండే మార్నెళ్ల రేవతి(52) ఆమె నివాసం ఉండే ఎదురుగానే శుక్రవారం ఉదయం కిందపడి మృతిచెందింది. ఇంటి యజమాని మొహమ్మద్ చిద్రీస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు 8688831069 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

## క్లీన్ గుంటూరుకు ప్రణాళికలు సిద్ధం చేస్తాం

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న పెమ్మసాని, ఎమ్మెల్యే మాధవి

గుంటూరు ఎడ్యుకేషన్: భారీ వర్షాల కారణంగా జలమయమవుతున్న లోతట్టు ప్రాంతాల్లో ముంపు నివారణకు శాశ్వత ప్రణాళికలు సిద్ధం చేస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి– కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని చుట్టుగుంట, ఏటీ అగ్రహారం, కేవీపీ కాలనీ, జోసఫ్‌నగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో స్థానిక ఎమ్మెల్యే గల్లా మాధవి, నగరపాలకసంస్థ అధికారులతో కలసి పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో మురుగు కాలువల వ్యవస్థను పరిశీలించారు. చుట్టుగుంట రైతు బజార్ సమీపంలోని సజావుగా సాగని డ్రెయిన్లను పరిశీలించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సైడ్ కాలువలు విస్తరించని కారణంగా మురుగు పొంగి రోడ్ల మీదకు చేరుతోందని ఏటీ అగ్రహారంలో స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. జోసఫ్ నగర్‌లో సైడ్ కాలువల సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. చంద్రభానుడిగుంట చెరువు ఇటీవల పొంగి నీటి మునిగిన ప్రాంతాలను పరిశీలించారు. భారీ వర్షం కురిసిన ప్రతిసారీ సమీపంలోని నాలుగు కాలనీలు ముంపునకు గురవుతున్నాయని స్థానికులు విన్నవించారు. సమస్యకు పరిష్కారం దిశగా సీఎస్ఆర్ ఫండ్ లేదా అమృత్ పథకం కింద ఆ ప్రాజెక్టును చేర్చి త్వరగా ప్రక్రియను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. జోసఫ్ నగర్, లక్ష్మీనగర్, నల్లపాడు రోడ్డు వద్ద జరిగిన పరిశీలనలో భాగంగా కార్పొరేషన్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ భారీ వర్షాల వలన లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపట్టడంతో పాటు గుంటూరును క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. పర్యటనలో నగరపాలకసంస్థ అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మి, డిప్యూటీ కమిషనర్లు శ్రీనివాస్, వెంకటకృష్ణ, ఎస్ఈ శ్యామ్ సుందర్, టౌన్ ప్లానర్ రాంబాబు, టీపీఎస్ లక్ష్మణస్వామి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, క్రిస్టియన్ మైనారిటీ సెల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల మ్యానీ పాల్గొన్నారు.